
శుభోదయకాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ లోని శుభోదయకాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆయాశాఖల అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే శుభోదయకాలనీలో పర్యటించారు. కాలనీ ప్రతినిధులు, మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచిన తర్వాతనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 12ఇంచుల సైజు పైపులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు, పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, సిబ్బంది షబ్బీర్, శ్రీహరి, శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, సదానంద్‌రెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, జంగయ్య, రోజారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.


ఎదుర్కోలు, గరుడపట ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గరుడపట ధ్వజారోహణం, ఎదుర్కోలు

మన్సూరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడపట ధ్వజారోహణం, ఎదుర్కోలు మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విజయశ్రీకాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ

వనస్థలిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్షయవ్యాధిపై అవగాహన కలిగిఉండాలని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ, డాక్టర్ నాగేందర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో అనేకమంది క్షయ(టీబీ) వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీబీ వ్యాధిని మొదట్లోనే గుర్తించడం వల్ల ఈ వ్యాధిని అరికట్టవచ్చని, ఎలా అరికట్టాలనే విషయంపై ఆస్పత్రికి వచ్చిన రోగులకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ప్రశాంత వాతావరణాన్ని అలవర్చుకుని వ్యాధులను అరికట్టాలన్నారు. డాక్టర్ మహబూబ్‌ఖాన్, డాక్టర్ రాములు, డాక్టర్ జయమాల, నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యాన్ని నేటితరం ఆదరించడం లేదు

● సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి


మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి

వనస్థలిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సాహిత్యాన్ని వెనుకటి తరం ఆదరించినంతగా నేటితరం ఆదరించడం లేదని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో విశ్రాంత న్యాయవాది కట్టా భగవంతరెడ్డి రచించిన జర్నీ త్రూ స్ప్రింగ్ అండ్ థండర్ అనే ఆంగ్ల పద్య కావ్య పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీలతో కలిసి పాశం యాదగిరి మాట్లాడారు. సాహిత్యాన్ని నేటితరం ఆదరించకపోవడంలో మీడియా కూడా ఒక కారణం అన్నారు. ప్రేమ, కుటుంబం, సామాజిక బాధ్యతలు నెరవేర్చుతూనే జరుగుతున్న అన్యాయాల మీద సుదీర్ఘ ప్రతిఘటననూ సాగిస్తున్న కట్టా భగవంతరెడ్డి పుస్తకం నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, డీసీ తిప్పర్తి యాదయ్య, నారగోని వెంకటయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.


జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కుంగిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో కుంగిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కొత్తపేట - నాగోల్ చౌరస్తా ప్రధాన రహదారిలో కుంగిన ఆర్‌సీసీ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ కవర్ దుస్థితిని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు విన్నవించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మ్యాన్‌హోళ్లను అధికారులు పరిశీలించాలని, అవసరమైన చోట్ల మరమ్మతు పనులు చేపట్టాలని, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ చుట్టూ గార్డింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎలిమినేటి జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

కోళ్ల పందేల స్థావరంపై ఎస్‌ఓటీ దాడులు

● 13 మంది అరెస్ట్, రూ. 13వేలు, కోళ్లు, కత్తులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ/ పహాడిషరీఫ్ : జల్‌పల్లి సమీపంలోని వెంచర్‌లో నిర్వహిస్తున్న కోళ్ల పందేల స్థావరంపై దాడి చేసిన మహేశ్వరం ఎస్‌ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు కలిసి 13మందిని అరెస్ట్ చేశారు. జల్‌పల్లి గ్రామంలోని బాలాజీ వెంచర్ వద్ద కోళ్ల పందేలు నిర్వహిస్తుండగా దాడిచేశారు. తెన్నేరు వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, బాదినేటి వీరబాబు, బొరుబోయిన నాగరాజు, వజ్జె హరీష్, మహీపాల్ వెంకటేశ్వర్, వేగేసిన ఉదయ్‌భాస్కర్‌రాజు, తన్నేరు రవీందర్, వివాకుల వీర్రాజు, చెరుకూరు గోపి, అట్లపంతుల వెంకట్, బిసల్‌సింగ్, దేవరకొండ అంకయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13 వేల నగదు, 10మొబైల్‌ఫోన్లు, రెండు కోళ్లు, కోళ్లకు కట్టే కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

అధ్వానంగా మదర్ డెయిరీ రోడ్డు

● ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

● గుంతలను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలి



ప్రమాదాలకు కారణం అవుతున్న మదర్ డెయిరీ రోడ్డుపైన తీసిన కాలువలు

హయత్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ రోడ్డుపై అక్కడక్కడ తీసిన కాలువల వల్ల నిత్యం ప్రమాదాలు జరిగి వాహన దారులు తీవ్ర గాయాలకు గురవుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ డ్రైనేజీని ట్రంకు లైనులో కలపడానికి మదర్ డెయిరీ రోడ్డులోని మూడు ప్రాంతాల్లో కాలువలు తీసి డ్రైనేజీని కలుపుకుని కాలువలను మట్టితో పూడ్చారు. అయితే మట్టి అనిగి పోయి గుంత ఏర్పడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట రెండు చోట్ల, డబల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో ఒక చోట రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు కిందపడి తీవ్రగాయాలకు గురవుతున్నారు. ఆటోలో ప్యాసింజర్లను ఎక్కించుకుని అందులో నుంచి వెళ్లడం కష్టంగా ఉందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపైన ఏర్పడిన గుంతలను డాంబర్ లేదా సిమెంటుతో పూడ్చి ప్రమాదాన్ని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఇంటర్నేషనల్ ఉమెన్స్ మంత్ వేడుకలు



లయను సన్మానిస్తున్న ఇంద్రప్రస్థకాలనీ మహిళా విభాగం సభ్యులు

మన్సూరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ శ్రీఇంద్రప్రస్థ కాలనీ రోడ్ నంబర్ 5లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ మంత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలనీ మహిళా విభాగం ముఖ్య సలహాదారురాలు, హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ కాలంశెట్టి లయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలను స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ మహిళా సాధికారతపై చేస్తున్న కృషి పట్ల కె.లయను అభినందించారు. వేడుకలో భాగంగా మహిళల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పలు రకాల క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, ప్రధానంగా చిరువ్యాపారాలు, చేతి వృత్తులు చేసే వారిని ఒకే వేదికపైకి తెచ్చి వారి ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయించి ప్రోత్సహించారు. అనంతరం ఉన్నత విద్యావంతులు, పలు రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు, 22 మంది సీనియర్ సిటిజన్ ఉమెన్స్, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట్ కౌన్సిలర్లు రోహిణి, శ్రీధర్‌రెడ్డి, ఇంద్రప్రస్థకాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆదిపూడి గాయత్రి, మహిళావింగ్ అధ్యక్షురాలు రోహిణిరాజ్‌గోపాల్, సభ్యులు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభోత్సవంలో బాలకిషన్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ధన్‌రాజ్ తదితరులు

చలివేంద్రం ప్రారంభం

ఎల్బీనగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి సరూర్‌నగర్ డాక్టర్స్‌కాలనీ వైట్ హౌస్ సమీపంలో దిల్‌సుఖ్‌నగర్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు యాండ్ర లోకేశ్వర్‌రావు, వైఎఫ్‌సీఏ అధ్యక్షుడు దంపనబోయిన శ్రీనివాస్, వనస్థలిపురం అధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ, పెచ్చేటి దేవేందర్, పితాని శ్రీనివాస్, రాయుడు గణపతి, పాలా మూర్తి, వెంకటేశ్వరావు, బోస్, మురళి పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల కోలాహలం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల కోలాహలం మొదలైంది. సోమవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అధ్యక్ష పదవికి ప్రతాపరెడ్డి, బర్ల సునీత, జిల్లా రమేష్, సుందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. కార్యదర్శిగా భిక్షపతితో పాటు మరొకరు, ఉపాధ్యక్షులుగా బొడ్డు రమేష్, నర్సింహులు నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్లకు ఆఖరు. బార్ సోసియేషన్ కాలపరిమితి ఒక సంవత్సరం ఉంటుంది. ఎన్నికల అధికారులుగా ధీకొండ రవీందర్, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రవీందర్‌రావులు వ్యవహరిస్తున్నారు.


బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేసిన దుండగులు

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

వనస్థలిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు.. నగదును దుండగులు అపహరించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌కాలనీ రోడ్డు నం.9/4లో రిటైర్డ్ ఉద్యోగి టీ.వి సుబ్రహ్మణ్యం, లక్ష్మీకుమారి దంపతులు కొంతకాలంగా నివాసముంటున్నారు. ఈ క్రమంలో వీరిద్దరు ఈనెల 20న(గురువారం) నగరంలోని మదీనాగూడలో నివాసముండే తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరులేరని రెక్కి నిర్వహించిన గుర్తు తెలియని దుండగులు సోమవారం తెల్లవారుజామున ఇంటి తాళాలు పగులగొట్టి, ఇంట్లో పెట్టిన బీరువా తాళాలను గుర్తించారు. దీంతో బీరువాలో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదును అపహరించుకుని పారిపోయారు. కాగా ఇంటి పని మనిషి ఇట్టి విషయాన్ని గుర్తించి సుబ్రహ్మణ్యం దంపతులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బీరవాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును చూడగా కనిపించలేదు. వెంటనే సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో దర్యాప్తు చేపడుతున్నారు.


వార్షికోత్సవంలో పాల్గొన్న సరూర్‌నగర్ జడ్‌పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చంపాపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. చంపాపేట మందమల్లమ్మ చౌరస్తాలోని చంద్రాగార్డెన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన పూర్వ విద్యార్థుల అసోసియేషన్ 6వ వార్షికోత్సవ వేడుకలలో తమ బ్యాచ్‌కు చెంది ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన ఆజాద్ సెంట్రల్ ఉర్దూ యూనివర్సిటీ సీనియర్ అకౌంటెంట్ ఆర్.శ్రీనివాస్, విద్యుత్ సౌదా అకౌంట్స్ ఆఫీసర్ ఆరోగ్యరాణి, శంషాబాద్ తొండుపల్లి స్కూల్ హెచ్‌ఎం స్వర్ణలతలను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు తాము చదువుకున్న పాఠశాల చిత్రంతో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంద రాంచంద్రారెడ్డి, ఎస్.బాల్‌రెడ్డి, రఘునాథ్ శర్మ, హుస్సేన్‌ఖాన్, వేదవతి, భావణి, బాలమణి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

సైదాబాద్, మార్చి 24(ఆంధ్ర జ్యోతి): హస్తినపురం కార్పొరేటర్ సుజాతానాయక్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణికాలనీ సమీపంలో చంపాపేట ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్‌నాయక్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నేతలు అశోక్‌రాథోడ్, క్రొర లక్‌పతినాయక్, బాబురామ్‌నాయక్, శంకర్‌నాయక్, రాజురాథోడ్, తదితరులు పాల్గొన్నారు. సుధీర్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని లేకపోతే వేలాది మంది గిరిజనులతో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గణేష్‌నాయక్ హెచ్చరించారు. ఈ విషయంపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామన్నారు.

వ్యాపార లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోండి

● కమిషనర్ అమరేందర్‌రెడ్డి


వ్యాపారికి నోటీసు అందిస్తున్న మున్సిపల్ అధికారి ప్రవీణ్

హయత్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారులంత ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలని కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మార్చి 31వ తేదీ లోగా రెన్యూవల్ చేయించుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. చెల్లించని పక్షంలో 25శాతం జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. 2024-2025 సంవత్సరం వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించని వారు వెంటనే చెల్లించాలని కోరారు. వ్యాపార లైసెన్స్ ఫీజులు, పన్నులు, చెల్లించడం ద్వారా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఏఐసీసీ తరుణ్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా బోయపల్లి


రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్: ఏఐసీసీ తరుణ్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు విచార్ విభాగ్ చైర్ పర్సన్ డాక్టర్ గిరిజావ్యాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ పెద్దలకు, తనపై నమ్మకంతో పదవి అప్పగించిన గిరిజావ్యాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అహర్నిశలు పార్టీ కోసం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

మహేష్ హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

● పోలీసుల అదుపులో మరో ఇద్దరు

కొత్తపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి శివగంగ కాలనీలో జరిగిన పాత నేరస్థుడు బొడ్డు మహేష్ హత్య కేసులో విచారణ కొనసాగుతోందని సమాచారం. ఆదివారం తెల్లవారు జామున జరిగిన బొడ్డు మహేష్ హత్య కేసులో నలుగురు నిందితులను అదే రోజు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సోమవారం మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. క్రైమ్ టీం అధికారులు గుర్తు తెలియని ప్రాంతంలో వారిని విచారిస్తున్నట్లు తెలిసింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు శివగంగకాలనీ సహా భరత్‌నగర్ పరిసర కాలనీల అంతర్గత దారుల్లో గల సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారని సమాచారం. పోలీసులు ఆదివారం బొడ్డు మహేష్‌తో చివరిసారి కలిసిన యువకులను విచారించారు. నిందితుల మొబైల్ ఫోన్ల కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. శనివారం మహేష్ కదలికలను తెలుసుకునేందుకు నిందితులకు ఎవరు సహకరించారు, మహేష్‌ను హత్య చేసేందుకు గల కారణాలు, ఈ హత్యకు ప్రేరేపించిన, గతంలో నిందితులు మహేష్‌ల మధ్య గొడవలు, జరిగిన ఇతర ఘటనల సమాచారాన్ని సేకరిస్తున్నారని సమాచారం.




పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మంచిరెడ్డి అనంతరెడ్డిని సన్మానిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతరెడ్డి

చంపాపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంపాపేటలోని ప్రభుత్వ కేంద్ర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి నియమితులైనారు. సోమవారం అనంతరెడ్డిని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సారెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మలక్‌పేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన ఆశావర్కర్లు

ఆశావర్కర్ల అరెస్టు

చాదర్‌ఘాట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లు చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మలక్‌పేట పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆశావర్కర్లను అరెస్టు చేశారు. సోమవారం ఉదయం నుంచే ఆశావర్కర్లను గుర్తించి ముందస్తుగా అరెస్టు చేసినట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా మలక్‌పేట పోలీసులు 10మంది ఆశావర్కర్లను ముందస్తుగా అరెస్టు చేశారు.


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

మీర్‌పేట్‌లో ఇంటిపన్ను తగ్గించాలని 27న నిరాహార దీక్ష

సరూర్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటిపన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకుగాను ఈనెల 27న మునిసిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మీర్‌పేట్ క్లస్టర్-1,2 అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్‌ముదిరాజ్ తెలిపారు. సోమవారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పన్నుల భారంపై ఇటీవల తమ పార్టీ ఆధ్వర్యంలో సీడీఎంఏ, జిల్లా కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ తదితరులకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని, దాంతో నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని వారు చెప్పారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీల ప్రజలు ఈ దీక్షకు సంఘీభావం ప్రకటించి విజయవంతం చేయాలని వారు కోరారు. తదుపరి కార్యాచరణను 27వ తేదీన ప్రకటిస్తామని, ఒక్కో రకంగా ఆందోళనలు చేపట్టి ప్రభుత్వం దిగి వచ్చేలా చూస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్లు గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, భీమ్‌రాజ్, బాలకృష్ణ, గౌరీశంకర్, పార్టీ నాయకులు సోమేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, మధు, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్మాణం పూర్తిచేయాలి

సరూర్‌నగర్: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, లెనిన్‌నగర్‌లలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల నిర్మాణం పనులు తొందరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలోగా అందుబాటులోకి తీసుకురావాలని సీఆర్‌పీఎఫ్(చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్) అధికారులను కోరింది. ఈ మేరకు సోమవారం ఫోరమ్ కన్వీనర్ మారబోయిన నరేందర్, కోకన్వీనర్ కొల్లూర్ భీమేశ్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి ముకుందం తదితరులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా పాఠశాలల నిర్మాణం పనులు మూడేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయని, ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో గదులు సరిపోకపోవడంతో అనేక మంది విద్యార్థులు అడ్మిషన్లు లభించక గత్యంతరం లేక ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా వాటి నిర్మాణం పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు.

కనుల పండువగా కల్చరల్ డే


తమ నృత్యప్రదర్శనతో ఆకట్టుకుంటున్న విద్యార్థినులు

మన్సూరాబాద్ : వనస్థలిపురం భాష్యం ఉన్నత పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రలవి గార్డెన్స్‌లో 'కల్చరల్ డే'ను సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకోగా ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు బహుమతులను ప్రదానం చేయగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, సీఈఓ చైతన్యలు వారిని అభినందించారు. అనంతరం రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించిన విద్యార్థి నాయకులను వారు ప్రకటించారు. ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.